**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 05.07.2026** **సమయం:18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. హైదరాబాద్ మెట్రో రైల్ రెండో ఫేజ్ విస్తరణకు అనుమతులు మంజూరు చేయడంతో పాటు, తొలి ఫేజ్ ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, కిషన్ రెడ్డికి లేఖలు రాశారు.
2. నేటి ఆధునిక జీవనశైలికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచించారు.
3. హైదరాబాద్‌లోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.
4. రాబోయే మూడు రోజుల పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

.....................................................................

**మెట్రో-సీఎం**

హైదరాబాద్ మెట్రో రైల్ రెండో ఫేజ్ విస్తరణకు అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో తొలి ఫేజ్ ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి విడివిడిగా లేఖలు పంపారు. గత నెల 23, 24 తేదీలలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న

కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. మెట్రో ఒకటో ఫేజ్ ఆస్తుల విలువను నిర్ధారించడం, అధిక వడ్డీ రుణాల పునర్ వ్యవస్థీకరణ బాధ్యతలతో పాటు, రెండో ఫేజ్ విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎస్‌బీఐ క్యాప్స్ ను నియమించాలని ఉమ్మడిగా అంగీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ, ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ను ఖరారు చేయకపోవడం, ఎస్‌బీఐ క్యాప్స్ కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం వల్ల మెట్రో ఒకటో ఫేజ్ నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు, అనిశ్చితి ఎదురవుతున్నాయన్నారు. అలాగే రెండో ఫేజ్ డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ విషయంలో ఇద్దరు కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు.

....డెస్క్

**కిషన్ రెడ్డి-సికింద్రాబాద్**

మారుతున్న నేటి ఆధునిక జీవనశైలికి అనుగుణంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'ఫిట్ ఇండియా' నినాదం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని తమ రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సూచించారు. ఈ రోజు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మల్లేపల్లి డివిజన్ శ్రీరాంబాగ్ బస్తీలో కేంద్ర మంత్రి పర్యటించారు. అక్కడి రాంలీలా గ్రౌండ్‌లో స్థానిక ప్రజల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఆధునిక పరికరాలతో అందుబాటులోకి వచ్చిన ఈ ఓపెన్ జిమ్ స్థానిక యువతతో పాటు అన్ని వయసుల వారి ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, జూన్ నెలలో హైదరాబాద్‌లో సాధారణం కంటే 40 నుంచి 50 శాతం తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని సూచించారు.

......డెస్క్

**పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్‌లోని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ రోజు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తో కలిసి చాంద్రయణగుట్ట, నాంపల్లి నియోజకవర్గాలతో పాటు నాచారం కాలనీకి చెందిన 361 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ మహానగరంలో పేదల ఉపాధికి ఇబ్బంది కలగకుండా, వారు నివసించే ప్రాంతాల సమీపంలోనే విలువైన ప్రభుత్వ భూములను సేకరించి లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోందని వెల్లడించారు.

......డెస్క్

**పుష్కరాలు-మంత్రి అడ్లూరి**

రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారులు, పుష్కర ఘాట్లు, వసతి సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ రోజు జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాలలోని కోటి లింగేశ్వర స్వామిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు.

**....సౌండ్ బైట్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్....**

......జగిత్యాల జిల్లా- పీటీసీ

**కేటీఆర్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. ఈ పంప్‌హౌస్ నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా కిందికి పోతోందని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల

బృందంతో కలిసి ఈ రోజు పంప్ హౌస్ ను సందర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంప్‌లను ఆన్ చేయకపోతే, 60 వేల మంది రైతులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

.....డెస్క్

**మంచిర్యాల-మంత్రి వివేక్**

మారుమూల ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరుస్తామని రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి  వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

......పీటీసీ -మంచిర్యాల జిల్లా

**మంత్రి వాకిటి శ్రీహరి-షాద్ నగర్**

పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూక్‌నగర్ మండలం, అన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు.

........డెస్క్

**నాగర్ కర్నూల్- మంత్రి జూపల్లి కృష్ణారావు**

అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక.ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో 9వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ వేడుకలో మంత్రి పాల్గొన్నారు.

.......PTC నాగర్ కర్నూల్

**నారుమడి - భద్రాద్రి కొత్తగూడెం**

వరి సాగులో అధిక దిగుబడుల కోసం ఆరోగ్యకరమైన నారుమడి తయారీకి రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు రైతులకు సూచించారు. విత్తనాలను ముందుగా 24 గంటలు నీటిలో నానబెట్టి, అనంతరం 36 గంటలు మూట కట్టి మొలక వచ్చిన తర్వాత సెంటుకు 5 కిలోల చొప్పున నారుమడిలో సమానంగా చల్లాలని పేర్కొన్నారు.

.....పీటీసీ-భద్రాద్రి కొత్తగూడెం

**భద్రాద్రి కొత్తగూడెం-కలెక్టర్**

రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యూరియా బుకింగ్ యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు చేసినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఎకరాల వరకు ఒకేసారి.. రెండు నుంచి ఐదు ఎకరాల వరకు రెండు విడతల్లో.. ఐదు ఎకరాలకు పైగా సాగు చేసే రైతులు 40-30-30 శాతం నిష్పత్తిలో మూడు విడతల్లో యూరియాను బుక్ చేసుకోవాలని తెలిపారు.

....పీటీసీ- భద్రాద్రి కొత్తగూడెం

**నాగర్ కర్నూల్ - ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి**

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ మండలం తుడుకుర్తి గ్రామంలో 140 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం జరుగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు అమలులో రాజకీయానికి తావు లేదని చెప్పారు.

....పీటీసీ- నాగర్ కర్నూల్

**వాతావరణం**

రాగల మూడు రోజుల పాటు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణం కేంద్రం తెలిపింది. ఈ మేరకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది. మిగిలిన ప్రాంతాలలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు, బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది.

.....డెస్క్

**నియామకాలు**

తెలంగాణలో పోలీస్, అగ్నిమాపక, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగాలలో ఖాళీగా ఉన్న మొత్తం 7వేల 437 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి సంబంధించిన లోకల్ క్యాడర్ వివరాలు, విద్యార్హతలు, రోస్టర్ పాయింట్ల ఆధారంగా మరికొద్ది రోజుల్లోనే అధికారిక నియామక నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

**....పీఎస్**